తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం-03- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 186 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# త్వరితగతిన గ్లోబల్ సమ్మిట్ వేదిక పనులు

- అవసరమైతే మూడు షిఫ్టుల్లో పనులు చేయండి
- అధికారులను ఆదేశించిన మంత్రి శ్రీధర్‌బాబు
- వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



**హైదరాబాద్,డిసెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదిక వద్ద పనులు చురుకుగా సాగాలని, అవసరమైతే మూడు షిఫ్టుల్లో పనులు చేపట్టి పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. . మరికొద్ది రోజుల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదికగా జరగనుంది. ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా.. తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా ఈ సమ్మిట్ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి డి.శ్రీధర్ బాబు ఆదేశించారు.



# పవన్ జీ క్షమాపణలు చెప్పండి

- లేదంటే తెలంగాణలో మీ సినిమాలు ఆడవ్
- సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్,డిసెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):** ఎపి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు తెలియవని తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పవన్ కల్యాణ్ తెలిసీ తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం కాగానే ఆయన ఏదేదో మాట్లాడుతున్నారని తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోనసీమలో పర్యటించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం




# నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు



- సోనియా, రాహుల్‌లకు అండగా మనమంతా ఉన్నాం
- రాహుల్‌ను ప్రధానిని చేయడమే మన అంతిమ లక్ష్యం
- పార్లమెంట్‌లో ఓట్ చోరీపై చర్చ రాకుండా కుట్రలు
- రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పదేళ్లు పాలించినా ఒక్క ఎయిర్‌పోర్ట్ రాలే
- అభివృద్ధి,సంక్షేమంతో ముందుకు దూసుకెళ్తున్నాం
- పిసిసి సమావేశంలో సిఎం రేవంత్ కీలక ప్రసంగం

**హైదరాబాద్ ,డిసెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టీపీసీసీ సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు కీలక సందేశం పంపిస్తూ పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోదీ వైఖరి పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ.. కాంగ్రెస్ నాయకత్వానికి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గాంధీని హత్య చేసిన పార్టీ బీజేపీ అని అన్నారు.. నేషనల్ హెరాల్డ్ కేసు పేరుతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధించడం మోదీ ప్రభుత్వ లక్ష్యపూర్వక చర్యే అని విమర్శించారు. ఓటు చోరీపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా విచ్చలవిడిగా కేసులు తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విలువలను కాపాడే బాధ్యత అందరిదినని, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు మద్దతుగా నిలబడే తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు.

మిగతా 2లో

# హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ పోరుబాట

- ఎనిమిది బృందాలతో ఆయా ప్రాంతాల్లో పరిశీలన
- నేటి నుంచి రెండ్రోజులు ఎనిమిది బృందాల పర్యటన
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ వెల్లడి



**హైదరాబాద్,డిసెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ పరిధిలోని రూ.5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ హిల్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన నిజ నిర్ధారణ బృందాలను నియమించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశర చేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని

మిగతా 2లో



# పార్లమెంట్‌లో సంచార్ సాథీపై రగడ

- ప్రజల ప్రైవసీని దెబ్బతీసేదిని మండిపడ్డ విపక్షం
- దీనిని వెంటనే తొలగించాలని డిమాండ్
- అసవరం లేకుంటే తొలగించవచ్చన్న సింధియా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):** పార్లమెంట్‌లో సంచార్ సాథీపై అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ప్రధానంగా కాంగ్రెస్, శివసేన, తదితర పార్టీలు దీనిని తీవ్రంగా విమర్శిస్తూ ఇది.. ప్రజల ప్రైవసీ ఉల్లంఘనే అంటూ సభా కార్యక్రమాలకు అడ్డుతగిలాయి. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడిరది. విపక్ష కాంగ్రెస్ దీని మీద వాయిదా తీర్మానం దాఖలు చేసి సంచార్ సాథీపై విస్తృత చర్చ కావాలని డిమాండ్ చేసింది. సంచార్ సాథీ యాప్.. ఫోన్ యూజర్ల కదలికల్ని, మెసేజెస్, కాల్స్ మానిటర్ చేస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ దీనిని ఇదొక డిస్టోపియన్ టూల్ అని.. ఇది ప్రతి భారతీయుడిని మానిటర్ చేయడమే కాకుండా.. వారి ఆర్థిక హక్కులపై దాడిగా అభివర్ణించారు. దీని అమలు రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపి రేణుక చౌదరి దీనిపై వాయిదా తీర్మానం దాఖలు చేశారు. మరో ఎంపిప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ ఇది ఒక దారుణమైన పరిణామమని.. ఇది భవిష్యత్‌లో నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. ప్రజల గోప్యతను హరిస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోష్ కూడా దీనిని తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ప్రభుత్వంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తుందని విమర్శించారు. విపక్షాల ఆందోళన నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. సంచార్ సాథీ యాప్ పై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. సంచార్ సాథీ మీద చర్చకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, కానీ ఎజెండా ప్రకారం సెషన్‌లో 14 బిల్లులపై ఫోకస్ పెడదామని సూచించారు. అటు, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికామ్ కూడా దీనిపై స్పందించింది.

మిగతా 2లో

# రోడ్డెక్కిన ఉస్మానియా స్టూడెంట్స్

- నాసిరకం భోజనంతో విసిగిపోయిన యూ.ఓ.యూ స్టూడెంట్స్
- ఫిర్యాదులు చేయినా స్పందన లేని అధికారులు
- పాడైన ఆహారంతో అనారోగ్యం... విద్యార్థుల ఆందోళన
- రాత్రి నిరసనతో రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం

2లో



# రోహింగ్యాలకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలకాలా?

- అదృశ్యంపై కేసులో సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):** రోహింగ్యా శరణార్థులను వెనకేసుకుని వచ్చేలా పిటిషన్ దాఖలు చేయడంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. రోహింగ్యాల అదృశ్యంపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టుకీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారికి.. న్యాయస్థానం అసాధారణ రక్షణలు కల్పించాలా అని ప్రశ్నించింది.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరించే ప్రక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడిరచారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు. డిసెంబర్ 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచస్థాయిలో నిలబెడతామని ఆయన ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9వ తేదీన తెలంగాణ `2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు. కోర్ అర్బన్‌ను క్యూర్ చేయాలని తాము నిర్ణయించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, పరిశ్రమల తరలింపు తదితర అంశాలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. కొన్ని పరిశ్రమలు నడిచే పరిస్థితి లేక మూతపడ్డాయన్నారు. మరికొన్ని పరిశ్రమల ఊరు, నగరం నడిబొడ్డున ఉన్నాయని.. ఆయా పరిశ్రమల ను తరిలిస్తే కొంత భూమి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకెళ్తున్నామన్నారు. గత పదేళ్లలో తెలంగాణకు ఒక్క ఎయిర్‌పోర్టు కూడా తేలేదంటూ బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 4 ఎయిర్‌పోర్టులు తెచ్చామని గుర్తు చేశారు. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమం దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీ రాష్ట్రంగా చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. అందరి కృషితో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘా టించారు. కోటి మంది మహిళలకు చీరలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చీరలు అందలేదంటూ ఫిర్యాదులు వస్తే అందుకు డీసీసీలదే బాధ్యత అంటూ సీఎం హెచ్చరించారు. డిసెంబర్ నెలాఖరులోగా మహిళలందరికీ చీరలు అందించాలని డీసీసీలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక రాష్ట్ర పరిపాలన గురించి మాట్లాడుతూ.. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమ దిశగా ముందుకు తీసుకెళ్తున్నాం. కొత్త సర్పంచులు ఎన్నికయ్యే సందర్భంలో జిల్లా అధ్యక్ష పదవులు రావడం మీకు గొప్ప అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సులు వంటి సంక్షేమ పథకాలపై చర్చ పెట్టాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. కేసీఆర్ ఇచ్చిన చీరలు పనికిరావని ప్రజలు నిందించారు. కానీ, మనం నిజాయితీతో కోటి మందికి చీరలు ఇస్తున్నాం. ఏ ఆడబిడ్డ కూడా చీర దక్కకుండా ఉండకూడదని తెలిపారు. డిసెంబర్ నెలాఖరులోగా చీరలు అందజేయకపోతే అది జిల్లా కాంగ్రెస్ కమిటీల బాధ్యత అవుతుందని హెచ్చరించారు. అలాగే అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడుతూ.. నాచారం ప్రాంతంలోని పరిశ్రమలను పట్టణం వెలుపలకు మార్చాలని, ఇందుతో మధ్యతరగతి కుటుంబాలు భూములు కొనుగోలు చేయగలవని, పేదలకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అలాగే వరంగల్ ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన డిసెంబర్‌లో జరుగుతుందని వెల్లడిరచారు. మరోవైపు రాష్ట్రానికి బుల్లెట్ ట్రైన్ ఎందుకు ఇవ్వడం లేదని మోదీని ప్రశ్నిస్తానని, ఇస్తే.. ప్రజలకి మంచిది, ఇవ్వకపోతే తెలంగాణ ప్రజల రియాక్షన్ బీజేపీ చూస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై మాట్లాడుతూ.. రాజకీయాల్లో కాళ్లకు కట్టెలు పెట్టడం సహజం. కానీ అక్కడే ఆగిపోవద్దు, ముందుకు సాగాలని కార్యకర్తలకు హితబోధ చేశారు.తాను సీఎం అయ్యేముందు కొంతమంది పై కోపం ఉన్నా, ఇప్పుడు పనిపై దృష్టి పెట్టి సైలెంట్‌గా ముందుకు సాగుతున్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో విభిన్న మనస్తత్వాలు ఉన్నప్పటికీ, మంచి అభిప్రాయం, మంచి ఉద్దేశాలు మాత్రం ఏకంగా ఉండాలని సూచించారు. ఇక చివరలో.. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనదే. నేను సీఎం కావచ్చు, కానీ ఆ పదవులు పొందడం నిజమైన కష్టమే. ఆ విలువ మీకు తెలుసు. అందరం కలిసే పని చేసినప్పుడే కాంగ్రెస్ బలపడుతుందని అన్నారు. టిపిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# త్వరితగతిన గ్లోబల్ సమ్మిట్ వేదిక పనులు

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న ఈ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా పరిశీలించారు. ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్షించారు. పలు దేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్స్, అతిథులు ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమ్మిట్ వేదిక వద్ద నుంచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 5వ తేదీ లోపు పనులన్నీ పూర్తి చేసి.. 6వ తేదీన డ్రై రన్ కండక్ట్ చేయాలని ఉన్నతాధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి భారీగా ప్రతినిధులు హైదరాబాద్ తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. అలాగే భద్రతను సైతం కట్టుదిట్టం చేస్తుంది. అందుకోసం డీజీపీ శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.ఈ



# పవన్ జీ క్షమాపణలు చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణ చెబితే.. తెలంగాణలో ఆయన సినిమా ఒకటి, రెండు రోజులు ఆడుతుందన్నారు. లేకుంటే సినిమాలు ఆడవని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. పవన్ కల్యాణ్ సోదరుడు చిరంజీవి సూపర్ మ్యాన్ అని ఈ సందర్భంగా అభివర్ణించారు. ఆయనకు రాజకీయాలతో సంబంధం లేదని గుర్తు చేశారు. అన్ని తెలుసుకుని మాట్లాడితే మంచిదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి హితవు పలికారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాము ఎంతో నష్టపోయామని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఆదాయాన్ని విశాఖపట్నం, కాకినాడ, తిరుపతికే వాడుకున్నారని వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వల్ల నష్టపోయామని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి చెప్పుకొచ్చారు. కోనసీమ ప్రాంతంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నాయకుల దిష్టి వల్ల ఈ ప్రాంతంలోని కొబ్బరి మొక్కలు ఎండిపోయాయంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణలోని రాజకీయ నాయకులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ తెలంగాణ నేతలు డిమాండ్ చేస్తున్నారు.





# హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)

కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు.ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని, వాటి ఉద్దేశాలను పార్టీ నేతల బృందాలు ప్రస్తావించనున్నాయి. డిసెంబర్ 3, 4 తేదీల్లో హిల్ట్ పాలసీ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. ఇందులో భాగంగా.. క్లస్టర్`1లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలో మాజీమంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించనున్నారు.

క్లస్టర్`2లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నేతృత్వంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు. క్లస్టర్`3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి నేతృత్వంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో కూడిన బృందం మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తారు. క్లస్టర్`4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.క్లస్టర్`5లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియాలను పరిశీలిస్తారు.క్లస్టర్`6లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు.క్లస్టర్`7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, పటోళ్ల కార్తిక్ రెడ్డి.. కాటేదాన్, హయత్‌నగర్‌లో పర్యటిస్తారు. క్లస్టర్`8లో మాజీ మంత్రి మహ్మూద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎండీ సలీం, చందులాల్‌తో కూడిన బృందం బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తారు.



# మల్లికుదుర్ల, వేలేరు నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

**హనుమకొండ,డిసెంబర్2(తెలంగాణ ముచ్చట్లు):**

మల్లికుదుర్ల, వేలేరు క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ వ్యవస్థను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. సర్పంచ్ మరియు వార్డు స్థానాలకు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్, సహాయక రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తున్న ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అప్పటివరకు అందిన మొత్తం నామినేషన్ల వివరాలను ఎన్నికల అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లు, పత్రాల స్వీకరణ విధానం, రికార్డు నమోదు వంటి అంశాలను సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు.

వేలేరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సదుపాయాల పరిశీలన వేలేరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ





# పార్లమెంట్‌లో సంచార్ సాథీపై రగడ

(మొదటి పేజీ తరువాయి)

సంచార్ సాథీ కేవలం ప్రజల సైబర్ సెక్యూరిటీ కోసం ఉద్దేశించింది మాత్రమేనని, ఇందులో ప్రైవసీ ఉల్లంఘన లేదంది. ఈ యాప్ యూజర్ డేటా రక్షిస్తుందని తెలియజేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా కీలక ప్రకటన చేశారు. స్మార్ట్‌ఫోన్ యూజర్లు తమ మొబైల్ నుంచి సంచార్ సాథీ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చని చెప్పారు. ఆ యాప్ తప్పనిసరి కాదని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇండియాలో స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే కంపెనీలకు ఇటీవల కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ కీలక ఆదేశాలు ఇచ్చింది. కచ్చితంగా స్మార్ట్‌ఫోన్లలో ప్రభుత్వ సంబంధిత సంచార్ సాథీ యాప్‌ను ప్రీ`ఇన్‌స్టాల్ చేసి ఉంచాలని పేర్కొన్నది. ఆ ఆదేశాలను విపక్షాలు తప్పుపడుతున్నాయి. సంచార్ సాథీ యాప్ వల్ల గోపత్యకు భంగం కలిగే అవకాశాలు ఉన్నట్లు విమర్శలు చెబుతున్నారు. భారత్‌లో విక్రయించే అన్ని మొబైళ్లలో ప్రభుత్వం రూపొందించిన సైబర్ సెక్యూరిటీ యాప్ సంచార్ సాథీని డిఫాల్ట్‌గా అందించాలని కేంద్రం మొబైల్ తయారీ సంస్థలను ఆదేశించింది. దీనిపై సోమవారం రాత్రి పీఐబీ ప్రెస్‌నోట్‌ను విడుదల చేసింది. ఈ ఆదేశాల అమలుకు 90 రోజుల గడువు ఇచ్చిన కేంద్రం..దానికి సంబంధించి 120 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రెస్‌నోట్‌లో స్పష్టం చేసింది.

దీనిపై విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కేంద్రం వెనక్కి తగ్గింది. ఇది తప్పనిసరి కాదని వెల్లడిరచింది. ఆ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చని చెప్పింది. అయితే దేశాన్ని నియంతృత్వం వైపు తీసుకెళ్తున్నారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకాగాంధీ దుయ్యబట్టారు. ఫోన్లపై నిఘానో, సంచార్ సాథీ యాప్ విషయమో కాదు.. అన్ని అంశాల్లో వారి వైఖరి అలాగే ఉందని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇది పెగాసస్ ప్లస్‌ప్లస్. బిగ్ బ్రదర్ మన ఫోన్‌ను, మొత్తం మన ప్రైవేటు జీవితాన్ని స్వాధీనం చేసుకుంటాడని కాంగ్రెస్ నేత కార్తి చిదంబరం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే విపక్షాలు పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం సృష్టించొద్దని, అన్ని అంశాలపైనా చర్చించేందుకు సిద్ధమని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆ విమర్శలను తోసిపుచ్చారు. కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పందించారు. ఆ యాప్‌ను వాడాలనుకోకపోతే.. మొబైల్ ఫోన్ వినియోగదారులు దానిని తొలగించే ఆప్షన్ ఉందని వెల్లడిరచారు.

మీరు దానిని కొనసాగించాలని అనుకుంటే.. మీ ఫోన్‌లో ఉంచుకోవచ్చు. డిలీట్ చేయాలనుకుంటే చేసేయొచ్చు. మీరు ఫోన్ కొనుగోలు చేసినప్పుడు ఎన్నో యాప్‌లు ముందుగానే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. అవి వద్దనుకుంటే తొలగించుకుంటాం కదా. ఇది యూజర్ల రక్షణకు సంబంధించిన అంశం. ఇందులో తప్పనిసరి ఏమీ లేదు. మీరు రిజిస్టర్ కాకపోతే.. అది అచేతనంగా ఉండిపోతుంది. డిలీట్ కూడా చేసుకోవచ్చు. అయితే మోసం నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఒక యాప్ ఉందని ప్రతిఒక్కరికీ తెలియదు. కాబట్టి ఆ సమాచారాన్ని వెల్లడి చేయడం ప్రభుత్వ బాధ్యత‘ అని మంత్రి వెల్లడిరచారు. ఫోన్ తయారీదారులకు ఆదేశాలు జారీ చేయడం వెనకగల కారణం ఇదేనన్న ఉద్దేశంలో సమాధానం ఇచ్చారు.

# రోహింగ్యాలకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలకాలా?

(మొదటి పేజీ తరువాయి)

రోహింగ్యాలు అదృశ్యమవుతున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'వారికి రెడ్‌కార్పెట్ వేసి.. ఆహ్వానించాలని మీరు కోరుకుంటున్నారా' అని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించింది. రోహింగ్యాలు సొరంగ మార్గాల ద్వారా భారత్‌లోకి వచ్చి.. ఆహారం, ఆశ్రయం వంటి హక్కులను డిమాండ్ చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. 'ఉత్తర భారతదేశంలో మనకు చాలా సున్నితమైన సరిహద్దు ఉంది. చొరబాటుదారులు చట్టవిరుద్ధంగా ప్రవేశిస్తే.. వారిని ఇక్కడ ఉంచాల్సిన బాధ్యత మనకు ఉందా?' అని వ్యాఖ్యానించింది.



## రోడ్డెక్కిన ఉస్మానియా స్టూడెంట్స్

**హైదరాబాద్,డిసెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):**

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు రోడ్కెక్కారు. మంగళవారం రాత్రి వడ్డించిన భోజనం చాలా నాసికరంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. కొద్దిరోజులుగా తమకు పాడైపోయిన భోజనం పెడుతున్నారని ప్రధాన రహదారిపై పెద్ద సంఖ్యలో విద్యార్థులు బైఠాయించారు. ఆహారం విషయంలో ఎలాంటి నాణ్యత లేదని ఆపై హాస్టల్ కూడా కనీస మౌలిక వసతులు లేవని తెలిపారు. యూనివర్సిటీలోని సమస్యల గురించి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వార్డెన్‌తో పాటు ప్రిన్సిపల్ కూడా పట్టించుకోవడం లేదని స్టూడెంట్స్ తెలిపారు.

హాస్టల్‌లో పాడైపోయిన ఆహారాన్నే తరుచుగా వడ్డించడం వల్లే తాము అనారోగ్యానికి గురవవుతున్నామని విద్యార్థులు వాపోయారు. రాత్రి సమయంలో బోజనం కోసం విద్యార్థులు రోడెక్కడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.





# ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో

# తెలంగాణ అగ్రగామిగా ఎదుగుదల..

- సీఎం రేవంత్ రెడ్డి
- పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్ఫూర్తితో పని చేస్తున్నాం
- సీతారామ ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు పూర్తి చేస్తాం
- డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రారంభించిన సీఎం రేవంత్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు;** ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాం రెడ్డిలతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి కి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పి బి. రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు.

కొత్తగూడెంలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మద్దతుకు ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు.

గతంలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం వందల ఎకరాల భూమి రైతులు ఇస్తే స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉపాధి లభించడంతో మొట్టమొదటిసారి తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడింది పాల్వంచ ప్రాంతంలోనని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ఈ ప్రాంతం అందించిందని అన్నారు. 60 సంవత్సరాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు ఈ విశ్వ విద్యాలయానికి పెట్టుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం అభివృద్ధి చెందడానికి ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీ అమలు చేశారని, ప్రస్తుతం దేశంలో ఉన్న గొప్ప విశ్వ విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆనాటి ప్రధానమంత్రినెహ్రూ ప్రారంభించినవి అని అన్నారు.

బాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని తెలిపారు. దేశం మొదటి ప్రధాని స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తెలంగాణను దేశ పటం మీద మొదటి స్థానంలో నిలుపుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు.

ఖమ్మం జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ఎర్త్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. కొత్తగూడెంకు వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఖమ్మం జిల్లాకు అందించాలని లక్ష్యంతో ముందుకు పోతున్నామని అన్నారు.

గోదావరి, కృష్ణ జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న మిగిలిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఖమ్మం జిల్లాలో ఉందని, ఇక్కడ మంత్రులు అనుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. ప్రజలకు రేషన్ కార్డు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు ఇటువంటి అనేక కార్యక్రమాలను ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించామని అన్నారు. భద్రాద్రి శ్రీ రామ చంద్రుని సాక్షిగా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు.

ప్రజలు వేసిన ఓటు ఫలితంగా రెండు సంవత్సరాల కాలంలో మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలలో మంచి అభ్యర్థులను, పని చేయగలిగే వారిని ఎన్నుకోవాలని, డబ్బులకు మద్యం బాటిళ్లకు, ప్రలోభాలకు లొంగవద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు.

డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగే తెలంగాణ విజయోత్సవాలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన మంత్రులను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళుతున్నానని, మరోసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వస్తానని, ఇక్కడ ప్రజలు అందించే ప్రేమ పూర్వకమైన స్వాగతం తనకు చాలా ఉత్సాహాన్ని ఇస్తుందని సీఎం తెలిపారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేస్తుందని, భూమి పరిసరాలు, భూమి లోపల ఉన్న ఖనిజాల గురించి విశ్వ విద్యాలయంలో పరిశోధనలు జరుగుతాయని, ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విద్యాలయం లకు నేడు తొలి అడుగు వేసామని అన్నారు. దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి అవసరమైన వసతులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దేశంలో వినూత్న విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించినందుకు ప్రజల తరపున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం జిల్లాకు గోదావరి జలాలు, విద్యుత్ కేంద్రం రావాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని అన్నారు.

రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆనాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత 10 సంవత్సరాల కాలంలో డాక్టర్ మోహన్ సింగ్ పేరున ఒక్క పథకం పేరు పెట్టకపోవడం గత పాలకుల దుర్బుద్ధికి నిదర్శనమని అన్నారు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని, ప్రజలు పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తమ ఆశీర్వాదాలు అందించాలని అన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న, ఎర్త్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, 800 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విద్యా చందన, వేణుగోపాల్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఆర్డీఓ మధు, ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# మన్మోహన్ సింగ్ పేరిట యూనివర్సిటీ.. ప్రజలకు గౌరవం

## కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ సభలో మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు;** మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పేరు పెట్టి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇవ్వడం ప్రజలకు లభించిన ప్రత్యేక గౌరవమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో నూతన యూనివర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. “పది ఏళ్ల పాలనలో ఒక స్కీమ్‌కైనా పేరు పెట్టలేదు” “తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మన్మోహన్ సింగ్ సేవలను గుర్తిస్తూ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం ఈ ప్రభుత్వ విలువలను ప్రతిబింబిస్తోంది. అయితే పది సంవత్సరాల పాలన చేసిన ముందున్న ప్రభుత్వం ఒక్క స్కీమ్‌కైనా ఆయన పేరు పెట్టకపోవడం వారి నడవడి ఎలా ఉందో ఈ రోజు ప్రజలకు బాగా తెలుస్తోంది” అని వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వం... ఇచ్చిన మాట అమలు “ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు దిశగా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పేదవారికి భరోసా, అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. రెండు సంవత్సరాల కాలంలో చేసిన పనులు ఇందిరమ్మ ప్రభుత్వ ధోరణిని స్పష్టంగా చూపుతున్నాయి” అన్నారు. “ప్రజల దీవెనలు ఉంటే ఇంకా పెద్ద నిర్ణయాలు సాధ్యం” ప్రజల మద్దతు, దీవెనలు కొనసాగితే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుంది. చిన్నారుల భవిష్యత్తు కోసం యూనివర్సిటీ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయి” అని తెలిపారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తం

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్




**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు;** ఆకర్షణీయమైన ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో నిర్వహిస్తున్న సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆటోల ద్వారా మైక్ ల ద్వారా మాల్స్, రైల్వే స్టేషన్స్ బస్టాండ్, రద్దీ ప్రాంతాలలో సైబర్ నేరాలపై ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు ప్రధనంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల మరింత జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అదే విదంగా నకిలీ ఆన్లైన్ ట్రేడింగ్ యాప్లు, వెబ్ సైట్లు రూపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని, వాట్సాప్. టెలిగ్రామ్, ఫేస్బుక్, ఇమెయిల్ ద్వారా లింక్ పంపుతూ.. మోసపూరిత వాగ్దానాలతో చేసి డబ్బు బదిలీ చేయించుకుని మోసం చేశారని పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి మోసపురిత ఆఫర్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మోసగాళ్లు పెద్ద కంపెనీ ఐపిఓ వచ్చిందని నమ్మదగిన ప్రకటనలు, నకిలీ వెబ్ సైట్ లు సృష్టిస్తారు. ఆ లింక్ లేదా ఫారమ్ ద్వారా బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఆధార్, పాన్ , లేదా యూపీఐ ద్వారా చెల్లింపులు చేయమని చెబుతారు. డబ్బు బదిలీ చేసిన తర్వాత మోసగాళ్లు వెబ్ సైట్ మూసేసి మాయం అవుతారు.కొన్నిసార్లు నకిలీ షేర్ సర్టిఫికేట్లు లేదా రసీదులు కూడా పంపి మోసం చేస్తారు.

సోషల్ మీడియా, వ్యక్తిగత మెసేజ్ ల ద్వారా వచ్చిన ఐ ఓ పి ఆఫర్లను నమ్మవద్దని,

ఎవరైనా ముందుగా “అడ్వాన్స్ పేమెంట్” లేదా “రిజిస్ట్రేషన్ ఫీజు" అడిగితే డబ్బు పంపవద్దని సూచించారు. తక్కువ పెట్టుబడితో లాభాలు వస్తాయని సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోలు, వాట్సాప్ గ్రూపులు లేదా టెలిగ్రామ్ ఛానెల్ ల ద్వారా “రోజుకు వేలల్లో లాభం”, “100% రిటర్న్" అంటూ ప్రకటనలు చేస్తారు. మొదట యాప్ లేదా వెబ్ సైట్లో రిజిస్టర్ చేయమని చెబుతారని, చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టగానే కొంత లాభం చూపించి నమ్మకం కలిగిస్తారని అన్నారు. ఆ తరువాత పెద్ద పెట్టుబడి పెట్టమని ప్రోత్సహిస్తారు. విత్ డ్రా చేయాలంటే “ట్యాక్స్”, “సర్వీస్ చార్జ్” పేరుతో డబ్బు అడుగుతారు. చివరికి వెబ్ సైట్ లేదా యాప్ యాక్సెస్ నిలిపివేసి, డబ్బుతో మాయమవుతారని అన్నారు. ఎవరైనా వీడియో కాల్, వాట్సాప్ లేదా మెసేజ్ ద్వారా పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేస్తే వెంటనే కాల్ కట్ చేసి పిర్యాదు చేయండి.

# చిల్కానగర్ పాఠశాలకు నలుగురు కొత్త టీచర్లు నియమించారు

**కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ కృషికి ప్రజలు ప్రశంసలు**

**చిల్కానగర్, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** చిల్కానగర్ డివిజన్ ఎం.పి.పి.ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరత సమస్యను పరిష్కరించేందుకు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తక్షణ చర్యలు తీసుకున్నారు.

పాఠశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు క్లాసులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ విషయం తెలియజేయగా, కార్పొరేటర్ గీతా ప్రవీణ్ వెంటనే స్పందించి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో సమావేశమై డీఈఓ విజయలక్ష్మికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన డీఈఓ విజయలక్ష్మి పిల్లల చదువుకు అంతరాయం కలగకుండా పాఠశాలకు నలుగురు నూతన ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంలో చిల్కానగర్ ప్రభుత్వ పాఠశాల యాజమాన్యం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరియు డీఈఓ విజయలక్ష్మికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రజాప్రతినిధుల వేగవంతమైన స్పందనకు పాఠశాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.



# విధుల్లో మానవత్వం చాటిన ఎస్సై సురేశ్



**వేలేరు, 02డిసెంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొంటూ వేలేరు ఎస్సై సురేశ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మల్లికుదుర్ల గ్రామంలో నామినేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సమయంలో ఓ మహిళ చిన్నారితో కలిసి నామినేషన్ వేయడానికి రావడం గమనించిన ఎస్సై సురేశ్, ఆమె ఇబ్బందిని గుర్తించి చిన్న పాపను తన చేతుల్లోకి తీసుకుని ఆలింగనం చేస్తూ కాసేపు ప్రేమగా ఆడించారు.

సాధారణంగా కఠినంగా కనిపించే పోలీసు అధికారులు ఇలా ఆప్యాయతతో వ్యవహరించడంతో అక్కడున్న ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# వక్ఫ్ ఉమ్మీద్ పోర్టల్ , ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ముస్లింలు అందరూ భాగస్వాములు కండి

## వక్తల పిలుపు

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు;** వక్ఫ్ ఉమ్మీద్ పోర్టల్ తో పాటు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ముస్లింలు అందరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు . మంగళవారం టిఎన్జిఎస్ మీటింగ్ హాలులో జమియత్ ఉలేమా ఏ హింద్ ( జే యు హెచ్ ) సంస్థ ఆధ్వర్యంలో వక్ఫ్ ఉమ్మీద్ పోర్టల్ , ఎస్ ఐ ఆర్ పై అవగాహన సదస్సును

నిర్వహించారు . దీనికి సంస్థ ఖమ్మం జిల్లా అధ్యక్షులు , రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా మహమ్మద్ సయీద్ అహమద్ ఖాస్మి పర్య వేక్షణలో రాష్ట్ర అధ్యక్షులు మౌలానా సయ్యద్ షా ఎసానోద్దీన్ ఖాస్మి అధ్యక్షత వహించారు . ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగించారు . తొలుత జేయు హెచ్ పతాకాన్ని ఆవిష్కరించారు . ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మౌలానా సయ్యద్ షా ఎసానోద్దీన్ మాట్లాడుతూ మన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు తప్పనిసరిగా ముస్లింలందరూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వక్ఫ్ ఉమ్మీద్ పోర్టల్ లో వివరాలను నమోదు చేయాలని సూచించారు . ఈ దేశంలో పుట్టి భారతీయులుగా జీవిస్తూ , ఇక్కడే మనం జీవితాన్ని ముగిస్తున్నామని కాబట్టి మరో ప్రక్రియ ఎస్ ఐ ఆర్ లో కూడా బాధ్యతగా భాగస్వాములు కావాలన్నారు . చట్టాలను గౌరవించే పౌరులుగా మనం మన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ , సోషల్ మీడియాల లో వస్తున్న వాటికి ప్రభావితం కాకుండా జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు . జే యు హెచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాఫిజ్ పీర్ ఖలీక్ అహ్మద్ సాబిర్ మాట్లాడుతూ వక్ఫ్ ఉమ్మీద్ పోర్టల్ లో ఉమ్మీద్ ఉన్నప్పటికీ ఈ ఉమ్మీద్ పై ఉమ్మీది లేకున్నప్పటికీ వక్ఫ్ ఉమ్మీద్ పోర్టల్ కార్యక్రమంలో మనం పాల్గొన్నాలన్నారు . మన నిర్లక్ష్యం , మన నిలిప్తత కారణంగానే ఇంత ఆలస్యంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి , అవగాహనపర్చాల్సి వచ్చిందన్నారు . సమయం తక్కువగా ఉందని , సుప్రీంకోర్టు దీనిని పొడుగిస్తుందో లేదో తెలియదని , త్వరితగతంగా వక్ఫ్ ఉమ్మీద్ పోర్టల్ లో మసీదులు , దర్గాల ఇతర ఆస్తులకు సంబంధించిన పత్రాలను తీసుకొని , నమోదు చేయాలన్నారు . ఎవరికైనా పత్రాలు లేకున్నా , ఉన్న ఈ పోర్టల్ పై అవగాహన లేకుంటే సమీప జేయు హెచ్ నాయకులను సంప్రదించాలన్నారు . ఖమ్మం జిల్లాకు సంబంధించి జేయు హెచ్ సభ్యుల సంఖ్యాపరంగా మంచి ప్రగతిలో ఉందని , ఈ నేపద్యంలో ఇక్కడ సదస్సు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు . ఇకనుండి గ్రామ గ్రామాలలో జే యు హెచ్ సమస్త సేవలను , సభ్యులను విస్తరింప చేయాలని పిలుపునిచ్చారు . ఇదే సమయంలో దేశ భవిష్యత్తుకు యువత మార్గదర్శకులని ఆ యువత చెడు మార్గాన వెళ్లకుండా మనం జేయుహెచ్ ఆధ్వర్యంలో వారిని సన్మార్గం చూపించాలన్నారు . జే యు హెచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ ఎలాంటి నల్ల చట్టాలు వచ్చిన ఈ దేశ పౌరులుగా చట్టాలను గౌరవిస్తూ ప్రతి ప్రక్రియలో శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా పాల్గొంటామన్నారు . అందరితోపాటు మేము మాతోపాటు అందరూ అనే రీతిలో ఈ దేశ జీవన ప్రవంతిలో కలసి మెలసి సాగుతామన్నారు . అనంతరం వందన సమర్పణ చేస్తూ కృతజ్ఞతలు ప్రకటించారు . ఈ కార్యక్రమంలో జే యు హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా ముస్సదిక్ ఖాస్మి , మౌలానా అబ్దుల్ సత్తార్ , నాయకులు మౌలానా హుస్సేన్ , మౌలానా అబ్దుల్ కరీం రషాది , మౌలానా అబ్దుల్ గని , కాంగ్రేస్ యువ నాయకుడు అల్ సాద్ , సయ్యద్ ఫురుకాన్ , మౌలానా హిదాయతులా, మునీర్ , హాఫీజ్ ఉస్మాన్ , ముఫ్తీ ఇమ్రాన్ ఖాన్ ఖస్మి , ముఫ్తీ ఆసిఫ్ అలీ ఖాస్మి , మౌలానా సల్మాన్ ఖాస్మి , మౌలానా ఆరిఫ్ సాబ్ ఖాస్మి పాల్గొన్నారు



# సీపీఎం అభ్యర్థులను గెలిపించండి: మోరంపూడి పాండురంగారావు

**సత్తుపల్లి, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సీపీఎం తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలు పార్టీలకు అతీతంగా గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వేంసూరులోని ఎర్ర రామయ్య భవనంలో ఎలిగినేని రామారావు అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో మాట్లాడిన ఆయన,

ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే, కేరళ తరహా సుపరిపాలన మరియు పేదరిక నిర్మూలన కార్యక్రమాలు గ్రామస్థాయి నుంచే అమలు కావాలంటే కమ్యూనిస్టు ప్రతినిధులు గెలవడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి కోసం పనిచేసే సీపీఎం అభ్యర్థులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశంలో పాల్గొన్న వారు:

మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు మల్లూరు చంద్రశేఖర్, మోరంపూడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు కొత్తా సత్యనారాయణ, అర్వపల్లి వెంకటేశ్వరరావు, డంకర శ్రీను, కొత్తా అప్పారావు, ఎండిమండల వెంకటేశ్వరరావు, గడిపర్తి మోహన్‌రావు, ఎలిగినేని రాంబాబు తదితరులు.



# పాలేరులో కాంగ్రెస్ జోరు...

### 20కి బీఆర్ఎస్ కుటుంబాలు హస్తం గూటికి

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు;** గ్రామ పంచాయతీ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో పాలేరు నియోజకవర్గ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీలోకి ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల నుంచి ఇరవై కుటుంబాలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో మంగళవారం చేరాయి.

తీర్థాల నుంచి 10 కుటుంబాల చేరిక

ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామానికి చెందిన పది కుటుంబాలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నాయి. బోడా వెంకన్న ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. చేరిన వారిలో భూక్యా బాస్ నాయక్, భూక్యా మోతిలాల్, సీతల అనంతరాములు, సీతల వీరన్న, సీతల నాగరాజు, సీతల శంకర్, భూక్యా బాస్, తేజావత్ శివ, తేజావత్ సురేష్ తదితరులు ఉన్నారు. వీరికి ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

మంగళిబండ తండా నుంచి ఉప సర్పంచ్ సహా...

అదేవిధంగా కూసుమంచి మండలం మంగళితండా నుంచి కూడా బీఆర్ఎస్‌కు చెందిన ఉప సర్పంచ్ తేజావత్ బాలకృష్ణ సహా మరో పది కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొన్నారు. తేజావత్ సుబాస్, తేజావత్ నరేష్, బానోత్ శ్రీను, తేజావత్ శోభన్, తేజావత్ కృష్ణ, తేజావత్ గోపి, బానోతు సింహాద్రి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కూడా క్యాంపు కార్యాలయంలో తుంబూరు దయాకర్ రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తేజావత్ వెంకట్, తేజావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.




# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్- 02, తెలంగాణ ముచ్చట్లు;** సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం ఇవ్వడానికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ పరిహారం నిర్ధారణ కు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి, జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతా రామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణం లో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని అన్నారు. ప్రాజెక్ట్ రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, భూసేకరణ చేయాలని ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది, అక్కడి భూములు సారవంతం అవుతాయన్నారు. ఉన్నదాంట్లో మంచి రేటు ఇచ్చే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. బాజుమల్లాయి గూడెం గ్రామంలో ఎకరానికి 2 లక్షల 70 వేల రూపాయలు ఉందని, భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా 5 లక్షల 40 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి 10 లక్షల 80 వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించగా, ఆర్బిట్రేషన్ లో 12 శాతం వడ్డీ క్రింద 64 వేల రూపాయలు కలిపి మొత్తం 11 లక్షల 44 వేలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపామని, అదేవిధంగా రేలకాయపల్లి గ్రామంలో ఎకరానికి 2 లక్షల 92 వేల రూపాయలు ఉందని, భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా 5 లక్షల 85 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి 11 లక్షల 70 వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించగా, ఆర్బిట్రేషన్ లో 12 శాతం వడ్డి క్రింద 70 వేల 390 వేల రూపాయలు కలిపి మొత్తం 12 లక్షల 40 వేల 390 రూపాయలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపామని, దీనికి రైతులు మరింత పెంచాలని కోరారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్ల, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు సెపరేట్ గా పరిహారం అందిస్తామని అన్నారు. కలెక్టర్ గా తనకున్న అధికారాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట పరిహారం అందజేయుటకు చర్యలు చేపట్టనున్నట్లు, భూ నిర్వాసిత రైతులందరూ అంగీకరించి, భూ సేకరణకు సహకరించాలని, ప్రభుత్వం నుండి పరిహారం త్వరితగతిన అందేలా చూస్తానని కలెక్టర్ అన్నారు. సమావేశంలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ తమ భూముల్లో సుబాబుల్ పంట వేశామని, పంట చేతికి వచ్చే సమయానికి, భూములను కోల్పోవడం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని అన్నారు. సుబాబుల్ పంట జీవితకాలాన్ని పరిగణలోకి తీసుకుని తదనుగుణంగా పరిహారం ఇవ్వాలన్నారు. భూమిలో ఉన్న పైప్ లైన్, చెట్లు, ఇతర పరికరాలు, డ్రిప్ సిస్టం వివరాలు సరిగ్గా నమోదు చేసి పరిహారం అందించాలని అన్నారు. అందరికి ఒకేసారి పరిహారం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్.డి.సి. ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ భూ సేకరణ అధికారులు, నిర్వాసిత రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పాలేరులో కాంగ్రెస్ జోరు...

### భార్యను కాపురానికి పంపాలంటూ... ఎంపీడీవో ఆఫీస్‌పైకి ఎక్కి హంగామా.!

**సత్తుపల్లి, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** తల్లాడ మండలంలో సోమవారం ఉదయం ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. తన భార్యను కాపురానికి పంపించాలని డిమాండ్ చేస్తూ ఓ యువకుడు ఎంపీడీవో కార్యాలయం భవనం పైకి ఎక్కి తీవ్ర ఉత్కంఠకు గురిచేశాడు. తల్లాడ మండలం కుర్నవెల్లి గ్రామానికి చెందిన మాడుగుల గోపి కొద్ది నెలల క్రితం మల్లారం గ్రామానికి చెందిన యువతితో వివాహం చేసుకున్నాడు. దంపతుల మధ్య మూడు రోజుల క్రితం గొడవ తలెత్తడంతో గోపి తన భార్యను కొట్టాడన్న ఆరోపణలపై ఆమె తల్లాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పుట్టింటికి వెళ్లింది.

ఈ వ్యవహారంపై గోపిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించగా, తనకు న్యాయం జరగలేదని, భార్యను కాపురానికి పంపించాలని చెప్పుకుంటూ ఉదయం ఎంపీడీవో ఆఫీస్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. పై నుంచి దిగొచ్చే పరిస్థితి లేకుండా బ్లేడుతో చేతిపై కోసుకుంటూ హంగామా సృష్టించాడు. సమాచారం అందడంతో తాసిల్దార్ కరుణాకర్ రెడ్డి, ఎంపీడీవో సురేష్ బాబు, పోలీసు సిబ్బంది, స్థానికులు అక్కడికి చేరుకుని గోపిని ఓదార్చి కిందికి దింపారు.

తరువాత పెద్దల సమక్షంలో భార్య కూడా అక్కడికి రావడంతో ఇరువురి మధ్య మాటలు జరిగి వివాదం సద్దుమణిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.




# మోడల్ స్కూల్‌లో గణిత ఒలింపియాడ్ పరీక్ష

**ఎల్కతుర్తి, డిసెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం రోజున హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు గణిత ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 70 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. గణిత ఒలింపియాడ్‌లో మంచి ప్రతిభ కనబరిచిన మొదటి పది మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారంగా శంకర్ నారాయణ డిక్షనరీలు ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మరియు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వి. లలిత చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ, గణిత ఒలింపియాడ్ పరీక్షలు విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యం, తార్కిక ఆలోచన, ఆత్మవిశ్వాసం వృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. అధ్యాపక బృందం మాట్లాడుతూ, మధురమ్మ ట్రస్ట్ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న గణిత టాలెంట్ టెస్టులు విద్యార్థుల దాగి ఉన్న ప్రతిభ వికాసానికి దోహదపడుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాపరమైన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అక్షిత, శ్రీ శేష్మ చెర్రీ, అంకిత, విశ్వరాజ్యశ్రీ, నాగేంద్ర, హన్సిక, కీర్తి ప్రియ, మాధురి, కీర్తనలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి. రాజశ్రీ, పి. శ్రీధర్ రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఏఎన్ఎం పూర్ణకు ప్రోత్సాహక బహుమతి

**తన నెలసరి వేతనం నుంచి 3వేలు అందజేసిన డాక్టర్ పోరిక రవీందర్ నాయక్**

**వరంగల్,డిసెంబరు2(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్సీడీ పరిశీలనా కార్యక్రమంలో ప్రత్యేక ప్రతిభ కనబరచిన పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని బొల్లికుంట ఉపకేంద్ర ఏఎన్ఎం పూర్ణకు జిల్లా ఎన్సీడీ కార్యక్రమాధికారి డాక్టర్ పోరిక రవీందర్ నాయక్ తన నెలసరి వేతనం నుంచి మూడు వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. ఎన్సీడీ పరిశీలనలు సమయానికి, సక్రమంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించిన ఆరోగ్య సిబ్బందికి ప్రోత్సాహం ఇవ్వడం అవసరమని పేర్కొన్నారు. మార్చి నెలాఖరులో కూడా ఇదే విధంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బందికి తన ఖర్చుతోనే బహుమతులు అందజేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ జులైద్ ఖాన్‌తో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# ఖమ్మం అర్బన్‌లో మెరిపించిన అయ్యగారిపేట జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్..!

**సత్తుపల్లి, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర స్థాయి స్వచ్ ఏవం హరిత విద్యాలయ రేటింగ్‌లో ఖమ్మం జిల్లా నగర విభాగంలో సత్తుపల్లి పట్టణంలో అయ్యగారిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. జిల్లా స్థాయిలో ప్రతిష్ఠాత్మక స్థానాన్ని సాధించి, రాష్ట్ర ఎంపికకు అర్హత పొందింది. ఈ సందర్భంలో పాఠశాల తరఫున ప్రశంసాపత్రాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు (పిడి) చీకటి శ్రీదేవి స్వీకరించారు. పాఠశాల పరిశుభ్రత, హరిత వాతావరణం, విద్యార్థుల పాల్గొనడం వంటి అంశాల్లో చూపిన ప్రతిభకు ఈ గుర్తింపు దక్కినట్లు అధికారులు తెలిపారు.


# ఎక్స్ రే మెషిన్ కొనుగోలుకు ఆఫ్ లైన్ టెండర్ల ఆహ్వానం..

**జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్- 02, తెలంగాణ ముచ్చట్లు;** ఎక్స్ రే మెషిన్ కొనుగోలుకు జిల్లా కలెక్టర్ ఆఫ్ లైన్ టెండర్లకు ఆమోదం తెలిపారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధీకృత విక్రేతలు షార్ట్ టెండర్ ను సీల్డ్ కవర్ లో కలెక్టరేట్, వివి పాలెం, ఖమ్మం నందు గల మొదటి అంతస్తు, ఎఫ్1, రూం నెంబర్ 1 లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 3వ తేదీ నుండి 9వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు సమర్పించాలని, తక్కువ ధర సూచించిన ఏజెన్సీకి ఈ నెల 10వ తేదీ మ. 2.00 గంటలకు టెండర్ ఫైనల్ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి అన్నారు. షార్ట్ టెండర్లో పాల్గొనే వారు ఇఎండి యాభై వేల రూపాయలు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, ఖమ్మం పేరున డిడి ద్వారా చెల్లించాలని అన్నారు. ఎక్స్ రే మిషన్ పూర్తి సాంకేతిక స్పెసిఫికేషన్ కొరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, ఖమ్మం కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి పదవి నుండి యశ్వంత్ తొలగింపు

**హన్మకొండ,డిసెంబర్2(తెలంగా ముచ్చట్లు):** పెగడపల్లి సహకార సంఘంలో రుణ మాఫీ ప్రతిపాదనలను నిబంధనలకు విరుద్ధంగా పంపడం, రైతుల రుణ ఖాతాల నమోదు-నిర్వహణలో లోపాలు, సంఘానికి సంబంధించిన ఆదాయపు పరావర్తన పత్రాలను సమయానికి ఆదాయ పన్ను విభాగానికి పంపించకపోవడం వంటి అంశాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన కారణంగా సంఘ కార్యదర్శి ఎం.యశ్వంత్‌ను విధుల నుండి తొలగించినట్లు అధికారులు తెలిపారు.సంఘ కార్యకలాపాల్లో అనుసరించాల్సిన విధానాలను పాటించకపోవడం, వ్యవహారాల్లో సక్రమత కనబరచకపోవడంతో ఆయనను బాధ్యతల నుండి తప్పించే నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా, మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శి చ. గణేష్‌ను పెగడపల్లి సహకార సంఘానికి ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమిస్తూ హనుమకొండ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.





# విద్యార్థుల నైపుణ్యానికి, ఉపాధ్యాయుల కృషి తోడైతే అద్భుత విజయాలు..

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ -02, తెలంగాణ ముచ్చట్లు;** ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల నైపుణ్యాలు కలిపి ప్రభుత్వ విద్య ఉన్నత స్థాయి లక్ష్యాలను చేరేందుకు కృషి కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు ప్రభుత్వ పాఠశాలల మధ్య పోటీగా నిర్వహించిన పాఠశాల పరిశుభ్రత, నీటి నిర్వహణ, పర్యావరణ సంరక్షణ, విద్యార్థుల్లో స్థిరమైన జీవనశైలి అలవాటు పెంపు పట్ల అద్భుతమైన ప్రతిభ కనబర్చిన ఖమ్మం అర్బన్ లోని కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాల, అయ్యగారి పేట (బాలికలు), మల్లారం, చెన్నూరు, వేపకుంట్ల, చిన్న కోరుకొండి, జల్లేపల్లి, కుర్నవల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ప్రశంసపత్రాలు అందించి, వారిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మనకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులలో ఉన్న నైపుణ్యానికి, ఉపాధ్యాయుల కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం అవుతాయని అన్నారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల కోసం సర్వేలో పాల్గొని అత్యధిక స్కోర్ పొందిన 8 పాఠశాలలు జిల్లా నుండి ఎంపిక కావడం గర్వకారణమని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల విద్యా సామర్థ్యం పెంపు చేయడం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టడం అభినందనీయమని అన్నారు. పాఠశాల అత్యున్నత ప్రమాణాలను సాధించి, జిల్లా స్థాయిలో అగ్రస్థానాన్ని దక్కించుకున్న ఆదర్శ పాఠశాలగా ఎదిగి, జిల్లా విద్యా అభివృద్ధి రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ, జాతీయ విద్యా విధానంలో పేర్కొన్న పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టిన కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్య జైని, జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ బాజోజు ప్రవీణ్ కుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ , ఏఎంఓ ప్రభాకర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# గ్యార్వి షరీఫ్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు పరమేశ్వర్ రెడ్డి

**కాప్రా, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మీర్పేట్ హెచ్.బి. కాలనీ డివిజన్‌లో జరిగిన గ్యార్వి షరీఫ్ ఆధ్యాత్మిక వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రహీముద్దీన్ ఆహ్వానం మేరకు ఆయన వేడుకలకు హాజరయ్యారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "గ్యార్వి షరీఫ్ వేడుకలు భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీక. అందరికీ శాంతి, శ్రేయస్సు చేకూరాలని ప్రార్థిస్తున్నాను" అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ బలం అని, కాంగ్రెస్ ఈ విలువలను పాటించే పార్టీ అన్నారు. మత రాజకీయాలకు ఇక దేశంలో స్థానం లేదని, ప్రేమ, సోదరభావం, పరస్పర గౌరవమే సమాజాన్ని నిలబెడుతుందన్నారు.
కాంగ్రెస్ నాయకుడు రహీము ద్దీన్ మాట్లాడుతూ, పరమేశ్వర్ రెడ్డి హాజరుతో కార్యక్రమానికి మరింత ప్రాముఖ్యత ఏర్పడిందని, ఆయన ప్రసంగం సమాజంలో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించిందని తెలిపారు.ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతారాంరెడ్డి, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జి.విఠల్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్ పూర్ణ యాదవ్, నాయకులు శ్రీను, అజీజ్, ఎక్బాల్, అనిల్, శ్రీకాంత్ రెడ్డి, రాకేష్ యాదవ్, నాగరాజ్ యాదవ్, సతీష్ యాదవ్, సురేష్ గౌడ్, జానీ, బాబు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.






# పిల్లల భద్రతే పాఠశాలల మొదటి బాధ్యత సీపీసీఆర్ ఛైర్మన్ సీత దయాకర్

**మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ని ప్రతి పాఠశాలలో పిల్లల భద్రత, వారి రక్షణ అత్యంత ప్రాముఖ్యతతో పరిగణించాల్సిన అంశమని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (సీపీసీఆర్) ఛైర్మన్ సీత దయాకర్ అన్నారు. విద్యనందించడం వ్యాపారం కాదు, బాధ్యతగా స్వీకరించాలి. పిల్లలను అన్ని కోణాల్లో కాపాడటం పాఠశాల యాజమాన్యాల ప్రధాన బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సభగృహంలో, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ చిల్డ్రన్ ఇన్ స్కూల్స్" కార్యక్రమంలో ఆమె చందన, సరిత, డీఈఓ విజయకుమారి తదితర సభ్యులతో కలిసి పాల్గొన్నారు.
ఇటీవల చోటుచేసుకున్న చిన్నారులపై జరిగే ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు జిల్లా మొత్తం మీద కఠినమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన, కౌన్సిలింగ్, పిల్లలకు కౌన్సిలర్ వ్యవస్థ, సీసీ కెమెరాలు, వాహన భద్రతా చర్యలు, పోక్సో చట్టంపై అవగాహన వంటి అంశాలపై పైలట్ ప్రాజెక్టుగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.పాఠశాలల్లో పిల్లల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన అన్ని సదుపాయాలు తప్పని సరిగా కల్పించాలని ఆమె సూచించారు.
"మన ఇంట్లో పిల్లల పట్ల ఉన్న బాధ్యతంతా పాఠశాలల్లో కూడా ఉండాలి. సంఘటనలు జరిగిన తరువాత చర్యలకన్నా ముందస్తు నివారణ చర్యలే ముఖ్యము" అని పేర్కొన్నారు.పిల్లల శారీరిక మానసికాభివృద్ధికి ఆటస్థలాలు, గ్రౌండ్లలో శారీరక శ్రమ చాలా అవసరమని ఆమె గుర్తుచేశారు. అలాగే పిల్లలకు సంబంధించిన చట్టాలపై పాఠశాల సిబ్బందంతా అవగాహన కలిగి, చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో కమిటీలను ఏర్పాటు చేసి నెలకోసారి సమావేశమై సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని సూచించారు.జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ, పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండకూడదని, టీచర్లు పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దే ముఖ్య గురువులని అన్నారు. పాఠశాల యాజమాన్యాలు సూచించిన సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ బరిలో రఘునాయకుల కవిత

**వేలేరు, 02 డిసెంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో రఘునాయకుల కవిత w/o శ్రీధర్ రెడ్డి మంగళవారం భారీ జనాభాతో తీసుకువచ్చిన ర్యాలీ మధ్య సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి పట్ల తనకున్న అంకితభావాన్ని వ్యక్తం చేశారు. "గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, స్వచ్ఛమైన నీటి సరఫరా, కాలువల శుభ్రత, మహిళల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకొని పని చేయడానికి సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నాను" అని తెలిపారు. తమపై ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపిన కవిత, గ్రామ అభివృద్ధి కోసం తనకో అవకాశం ఇవ్వాలని కోరారు. భారీ మెజారిటీతో గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించాలని ప్రజలను కోరుతూ తన ప్రచారాన్ని ప్రారంభించారు.






TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# స్వతంత్ర అభ్యర్థిగా దామాల నాగరాజు నామినేషన్ దాఖలు



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థిగా దామాల నాగరాజు నిన్న నామినేషన్ దాఖలు చేశారు. ఉన్నత విద్యావంతుడు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న నాగరాజ్ ప్రస్తుతం ప్రైవేటు ఉపాధ్యాయునిగా పని చేస్తున్నార. దామాల నాగరాజు అనాసాగరం గ్రామాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంగా బరిలో దిగారు. ఒక్క అవకాశం ఇస్తే అనాసాగరం గ్రామ రూపురేఖలు మార్చేస్తానని ఒక్క అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలను కోరుకుంటున్నారు. గ్రామ ప్రజలందరికీ ఉచిత మినరల్ వాటర్ గ్రామంలో ప్రతి రోడ్డు సిసి రోడ్డు గా మారుస్తానని ఖమ్మంకోదాడ హవే బౌద్ధ స్తూపం నుండి అనాసాగరం గ్రామం వరకు డబల్ రోడ్డు నిర్మాణం కొరకు కృషి చేస్తానని తెలిపారు.

# నన్ను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు



- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ
- కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా అవకాశం కల్పించిన ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ తో పాటు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మరియు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు నూతి సత్యనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా మాట్లాడుతూ...డిసిసి అధ్యక్షులుగా పదవీ బాధ్యత చేపట్టే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరై ఆశీర్వదించిన డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లుబట్టి విక్రమార్కకు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతే కాకుండా శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి , మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పిసిసి సభ్యులు అధ్యక్షులు మహ్మద్ జావేద్ కు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి కు, కార్పొరేషన్ లు చైర్మన్ లు రాయల నాగేశ్వర్ రావు, నాయుడు సత్యనారాయణ,శాసన సభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, శాసనమండలి మాజి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్య కు, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులకు అనుబంధ సంఘ అధ్యక్షులకు, పెద్ద ఎత్తున హాజరైన పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఖమ్మం జిల్లా అంటే కాంగ్రెస్ కంచుకోట అని స్థానిక సంస్థల ఎన్నికల్లో మరో మారు రుజువు చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పథకాలు నేడు సజీవ సాక్షాలుగా ఉన్నాయని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికార పార్టీ అభ్యర్థి తోనే సాధ్యం అవుతుందని అన్నారు. అత్యధిక పంచాయతీలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాను రోల్ మోడల్ గా మరోసారి నిలపాలని కోరారు.



# కొమ్ముగూడెం పంచాయతీకి బి.ఆర్.ఎస్ అభ్యర్థిగా సోయం సత్యవతి నామినేషన్

**దమ్మపేట, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థిగా సోయం సత్యవతి నామినేషన్ దాఖలు చేశారు. దమ్మపేట మండలంలోని జెమేధార్ బంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమె రిటర్నింగ్ అధికారి వద్ద నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గ బి.ఆర్.ఎస్ నాయకులు సోయం వీరభద్రం, దమ్మపేట మండల బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకుడు సోయం రాజబాబు పాల్గొన్నారు. సమర్థవంతమైన స్థానిక పాలన కోసం తమ అభ్యర్థి ముందుకు వస్తోందని పార్టీ నాయకులు తెలిపారు.





# ఖమ్మంలో 108 సిబ్బందికి నైపుణ్య శిక్షణ.!

- ప్రాణాలను కాపాడే యోధులకు కొత్త పాఠాలు.
- శిక్షణ పొందిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేత.

**సత్తుపల్లి, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే 108 సిబ్బందికి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరు నెలలకు ఒకసారి ఇచ్చే ప్రత్యేక శిక్షణా తరగతులు ఘనంగా ముగిశాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఈ.ఎం.టీలు, పైలెట్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

ఈ తరగతుల్లో ఈ.ఎం.టీలు గడ్డం దీప్తి (అశ్వరావుపేట), దుర్గాభవాని (చంద్రుగొండ), సాకిరీ రమేష్ (దమ్మపేట), గొల్లమందల కృష్ణ (సత్తుపల్లి), కళాధర్ రావు (అన్నపురెడ్డిపల్లి), కాకర్ల మాధవరావు, పింగుల కృష్ణయ్య పాల్గొన్నారు. పైలెట్ విభాగం నుంచి పి. రాజా, కోండ్రు రవి, షేక్ సైదా, కటారి ప్రభాకర్ హాజరయ్యారు.

ఈ తరగతుల్లో సి పి ఆర్, యాక్సిడెంట్ కేసుల నిర్వహణ, గర్భిణీల అత్యవసర సేవలు, ట్రామా కేర్ వంటి కీలక అంశాలపై నిపుణులు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయ్యాక అందరికీ సర్టిఫికెట్ లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఈ.ఎం.ఈ అవులూరి దుర్గాప్రసాద్, మనోహర్, సతీష్, మూడు జిల్లాలకు పర్యవేక్షణ చేస్తున్న ప్రోగ్రామ్ మేనేజర్ పాటి శివకుమార్, శిక్షణ అందించిన పార్వతమ్మ, మహేష్ పాల్గొన్నారు. శిక్షణా బృందానికి సహాయకుడిగా సత్తుపల్లికి చెందిన ఈ.ఎం.టి. గొల్లమందల కృష్ణ పనిచేసి కార్యక్రమం విజయవంతం అయ్యేలా తోడ్పడ్డారు.







# పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన డీసీపీ కవిత

**ధర్మసాగర్,డిసెంబర్02( తెలంగాణ ముచ్చట్లు):** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దేవునూరు ,ధర్మసాగర్ గ్రామాల్లో నామినేషన్ ప్రక్రియను వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ డి.కవిత ప్రత్యక్షంగా పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా బందోబస్తు, ప్రవేశ -నిష్క్రమణ నియంత్రణ, అప్రమత్తత చర్యలు వంటి అంశాల్లో సిబ్బంది పాటించాల్సిన విధానాలను సూచించారు.తరువాత ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేసు రికార్డులు, రిజిస్టర్‌లు, రోజువారీ విధుల నిర్వహణ విధానాలను సమీక్షించారు. స్టేషన్ కార్యకలాపాలు మరింత చురుకుగా, పారదర్శకంగా ఉండేలా పోలీస్ సిబ్బందికి తగు మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ రావు పోలీస్టేషన్ ఆవరణలో డీసీపీ కి మొక్క అందించి స్వాగతం పలికారు.





# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు...

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు:** రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, దాఖలైన నామినేషన్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండవ విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కూడా తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. ఖమ్మం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నట్లు, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాలో మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, మొదటి దశ నామినేషన్ల పరిశీలన కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎన్నికలతో ముడిపడిన అంశాలపై వచ్చే ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. ఎన్నికల నిర్వహణకు మొదటి రాండమైజేషన్ పూర్తి చేశామని, రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం అవసరమైన ఏర్పాట్లు చేశామని, పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ స్ జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్ ఎస్ టి, ఎస్ఎస్ టి టీములు పనిచేస్తున్నాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, డిఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, సిపిఓ శ్రీనివాస్, డిసిఓ గంగాధర్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు ఆకారపు మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ గౌడ్



**నర్సంపేట,డిసెంబర్2(తెలంగాణ ముచ్చట్లు):** నర్సంపేట పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఆకారపు మల్లేశం మాతృమూర్తి ఆకారపు లక్ష్మీ నర్సమ్మ ఇటీవల మరణించగా, తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ సోమవారం వారి నివాసాన్ని సందర్శించారు. దివంగత లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ లక్ష్మీ నర్సమ్మ చూపిన మానవీయత, కుటుంబం పట్ల ఉన్న నిబద్ధత, జీవితంలో పాటించిన విలువలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవి కృష్ణ గౌడ్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు, రాష్ట్ర వైస్ చైర్మన్ సంఘాని మల్లేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి బీమగాని యాదగిరి గౌడ్, బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వేణు గోపాల్ గౌడ్, బీసీ జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, జిల్లా వైస్ చైర్మన్లు బోనగాని యాదగిరి గౌడ్, షైన్ కుమార్ యాదవ్, జిల్లా బీసీ యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, వైస్ చైర్మన్లు ఓర్సు సాంబయ్య, లక్కుర్స రమేష్, చిలువేరు కొమ్మాలు, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, నర్సంపేట మండల నాయకులు మారపాక రమేష్ ముదిరాజ్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, శీరంశెట్టి రాజేందర్ పెరక, బీసీ నాయకులు పంజాల రాజు, దుగ్గొండి మండల నాయకులు నన్నే రాజు, కొలిపాక సుధాకర్, దండు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.







# డంప్‌యార్డ్ వల్ల ప్రజలు నరకం అనుభవిస్తున్నారు ఈటల రాజేందర్

**జవహర్ నగర్, డిసెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** జవహర్ నగర్ డంప్‌యార్డ్‌ను బీజేపీ నాయకులతో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ పరిశీలించారు. ఒకప్పుడు రోజుకు 300 టన్నులు మాత్రమే వేస్తే, ప్రస్తుతం 10 వేల మెట్రిక్ టన్నులకు చెత్త పెరిగిందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దమ్మాయిగూడ, జవహర్‌నగర్, నారపల్లి, ఘట్‌కేసర్ పరిధిలో లక్షలాది పేద ప్రజలు చెత్త వల్ల శ్వాసకోశ వ్యాధులు, కలుషిత నీటి సమస్యలు, ఆరోగ్య ఇబ్బందులతో తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. బీజేపీ ఫిర్యాదులపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2017లో ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయలేదని దుయ్యబట్టిన ఈటల, 2021, 2022, 2025లో వచ్చిన తీర్పులనూ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. చెత్త లారీలకు కప్పు లేకుండా తిరగడం, స్థానికులపై డ్రైవర్ల దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఒకే ప్రాంతంలో చెత్త వేయడం దుర్మార్గమని, నగర నాలుగు వైపులా ప్రత్యామ్నాయ డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఈటల రాజేందర్ మండిపడ్డారు. గుండ్ల చెరువు నుంచి ఎదులాబాద్ చెరువు వరకు చెరువులు, భూగర్భ జలాలు కలుషితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాల తర్వాత ప్రజలతో కలిసి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయకపోతే "తాడో పేడో తేల్చుకుంటాం" అని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.



# రైతుల అభ్యున్నతికి కేంద్రం చర్యలు తీసుకోవాలి

## వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య

**ఢిల్లీ,డిసెంబర్02(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో అమలవుతున్న వ్యవసాయ పథకాల పురోగతి, లబ్ధిదారుల సంఖ్య, కేంద్ర నిధుల వినియోగంపై స్పష్టమైన వివరాలు వెల్లడించాల్సిందిగా వరంగల్ నియోజకవర్గ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోకసభలో ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల సమస్యలు, సాగుకు సంబంధించిన సవాళ్లు నిరంతరం పెరుగుతుండడంతో కేంద్రం మరింత బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. గ్రామీణ ఆర్థిక పరిస్థితుల బలోపేతం కోసం తాను ఎల్లప్పుడూ రైతుల తరపున వాదిస్తానని పేర్కొన్నారు. ఈ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమాధానం ఇచ్చారు.

ప్రధాన పంటలకు కనిష్ఠ మద్దతు ధరలు

రానున్న ఖరీఫ్ కాలానికి సాధారణ వరి కనిష్ఠ మద్దతు ధర రెండు వేల మూడు వందల అరవై తొమ్మిది రూపాయలు, మధ్యస్థరకం పత్తి ధర ఏడు వేల ఏడు వందల పది రూపాయలు క్వింటాకు నిర్ణయించబడినట్లు తెలిపారు. గత సంవత్సరం వరంగల్ జిల్లాలో రెండు లక్షల తొంభై ఐదు వేల పత్తి బేళ్లు, పదిహేనున్నర లక్షల టన్నుల వరి సేకరణ జరగడం రైతులకు ఆర్థిక భరోసా కల్పించినట్లు పేర్కొన్నారు.

నీటిపారుదల విస్తరణ —— సూక్ష్మ పద్ధతులకు ప్రాధాన్యం

'ఒక్క బిందువు - ఎక్కువ పంట' విధానంతో దేశవ్యాప్తంగా లక్షకు పైగా హెక్టార్లలో సూక్ష్మ నీటిపారుదల అమలు చేసినట్లు మంత్రి తెలిపారు. చిన్న రైతులకు యాభై ఐదు శాతం వరకు రాయితీ అందుతోందని చెప్పారు. ఆప్త ప్రాంతంలో పని చేసిన ప్రాజెక్టులు సాగు సామర్థ్యాన్ని దాదాపు ముప్పై లక్షల హెక్టార్ల వరకు పెంచాయని వివరించారు.

'ప్రతి చెరకు నీటివడులు' కార్యక్రమం కింద కమాండ్ విస్తీర్ణం రెండున్నర కోట్ల హెక్టార్ల మేర అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.

పంట బీమా ద్వారా రైతులకు భారీ పరిహారం

పంటల రక్షణ పథకం కింద గత ఏడాది పన్నెండు వేల కోట్లకు పైగా నష్టపరిహారం రైతులకు అందించబడిందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా ఆరో లక్షల హెక్టార్లకు పైగా వ్యవసాయ భూమి బీమా కవరేజిలో ఉండగా, పదికి పైగా కోట్ల మంది రైతులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందినట్లు వివరించారు.

### సేంద్రీయ సాగుకు పెరుగుతున్న ప్రోత్సాహం

సేంద్రీయ వ్యవసాయ ప్రోత్సాహ పథకం కింద ఇప్పటివరకు పదహారు లక్షల హెక్టార్లకు పైగా భూమిలో సేంద్రీయ సాగును ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఇరవై ఎనిమిది లక్షలకు పైగా మంది రైతులు లబ్ధి పొందుతున్నట్లు, మూడు సంవత్సరాలకు ఒక హెక్టారుకు ముప్పై ఒక వేల అయిదు వందల రూపాయల వరకు సహాయం అందుతోందని వివరించారు. వరంగల్ ప్రాంతానికి అనుగుణంగా ఈ పథకాల అమలు మరింత వేగవంతం కావాలని, ప్రాంతీయ రైతుల అభ్యున్నతే తన కృషి లక్ష్యమని వరంగల్ నియోజకవర్గ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.







# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్

**హనుమకొండ,డిసెంబర్2(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను మంగళవారం జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు పరిశీలించారు. ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి, పెద్దపెండ్యాల క్లస్టర్ల పరిధిలోని కేంద్రాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ విధానాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. రెండో విడతలో రెండు రోజులపాటు వచ్చిన మొత్తం నామినేషన్ల సంఖ్యపై రిటర్నింగ్ మరియు సహాయక రిటర్నింగ్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సహాయక కౌంటర్లు, అవసరమైన సౌకర్యాలు, పత్రాల తనిఖీ విధానం వంటి అంశాలను పరిశీలకులు సమీక్షించారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ఎన్నికల సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ధర్మసాగర్ మండల అభివృద్ధి అధికారి అనిల్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.







# డిజిటల్ అరెస్ట్.. బెదిరింపులకు నమ్మొద్దు

### ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" అవగాహన కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2, తెలంగాణ ముచ్చట్లు;** డిజిటల్‌గా అరెస్ట్ చేస్తామని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేసే సైబర్ నేరగాళ్ళ మాయమాటలు నమ్మి మోసపోవద్దని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రామానుజం అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో నిర్వహిస్తున్న సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పర్యవేక్షణలో ఖమ్మం పోలీస్ శిక్షణ కేంద్రంలో 150 మంది విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ..మీ వ్యక్తిగత సమాచారాన్ని, ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు, ఓ టీ పీ లను ఎవరితోనూ పంచుకోవద్దని అన్నారు.

అపరిచిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఫోన్ ద్వారా వచ్చిన అటాచ్‌మెంట్‌లను తెరవవద్దని సూచించారు.

డిజిటల్ అరెస్ట్, బెదిరింపుల గురించి భయపడవద్దని అన్నారు. డబ్బును బదిలీ చేయమని లేదా నగదు తీసుకుని ఇవ్వమని కోరే ఇటువంటి అభ్యర్థనలను విశ్వసించవద్దని పేర్కొన్నారు. మీరు ఏదైనా మోసానికి గురైనట్లు భావిస్తే, వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిందర్, సిఐ నరేష్ కుమార్ సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.





# మహేశ్వరం ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రి శ్రీధర్‌బాబు సమీక్ష

**మహేశ్వరం, డిసెంబర్ 02(తెలంగాణ ముచ్చట్లు):** మహేశ్వరం ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ఐటీ మంత్రి శ్రీధర్ బాబు విభాగాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో చీఫ్ సెక్రటరీ శాంతికుమార్ రామకృష్ణరావు, రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమ్మిట్ వేదికను స్వయంగా పరిశీలించిన మంత్రి, ప్రతి విభాగం చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అయిదో తేదీ లోపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి ఆరో తేదీన డ్రై రన్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించే ఈ సమ్మిట్‌లో చిన్న పొరపాటు కూడా చోటుచేసుకోకుండా శాఖలన్నీ పూర్తిస్థాయి సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి రానున్న అతిథులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు అత్యంత శ్రద్ధతో చేయాలని ఆదేశించారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్ వంటి కీలక విభాగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, సమ్మిట్‌ను విజయవంతం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# మిత్రుని కష్టసమయంలో తోడుగా నిలిచిన పదవ తరగతి స్నేహితులు

**పెద్దమందడ,నవంబర్04(తెలంగాణ ముచ్చట్లు):** అడ్డాకుల మండలం బలీదు పల్లి గ్రామానికి చెందిన పదవ సత్యనారాయణ ఇటీవల హైదరాబాద్ కోకాపేట్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెల్టూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో (1997 1998)బ్యాచ్ కలిసి చదువుకున్న తోటి స్నేహితులు విషయం తెలిసిన వెంటనే స్నేహితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ... మిత్రుడు జీవిత పోరాటంలో నిలబడేందుకు అండగా ఉండాలనే భావనతో, పదవ తరగతి క్లాస్‌మేట్స్ అందరూ ఒక చోట చేరి సహాయం చేయాలని నిర్ణయించారు.

ఆ నిర్ణయంతో తక్షణమే ప్రతి ఒక్కరు తమవంతు సహాయాన్ని అందిస్తూ, మొత్తం రూ.93,000/రూపాయల మొత్తాన్ని సేకరించారు. ఆ మొత్తాన్ని బాధితుడైన సత్యనారాయణ భార్యకు వ్యక్తిగతంగా అందజేశారు. ఈ సందర్భంలో స్నేహితులు మాట్లాడుతూ ..మనలో ఎవరికైనా ఇలాంటి కష్టకాలం వచ్చినప్పుడు మనమందరం కలసి సహాయం చేసుకోవాలి, అదే నిజమైన మానవత్వం, అదే నిజమైన స్నేహం" అని తెలిపారు.

పదవ తరగతి రోజుల నుండి ఒకే బంధంతో కొనసాగుతున్న ఈ స్నేహితులు సత్యనారాయణ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అలాగే ప్రమాదం తర్వాత తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణ త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తూ అందరూ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమం ద్వారా స్నేహితుల మధ్య మానవతా విలువలు, పరస్పర సహకారం ఎంత ముఖ్యమో మరోసారి చాటిచెప్పబడింది.

గ్రామ ప్రజలు, స్థానికులు కూడా క్లాస్‌మేట్స్ చేసిన ఈ మంచి పనిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో మాణిక్ వర్మ, ధనుంజయ, చందు రెడ్డి, శివకుమార్, బాలనాగి, సత్యనారాయణ కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.



# మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లెల ఆదిత్య రెడ్డి

**వనపర్,నవంబర్04(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ ను ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో వృత్తిపరుల కాంగ్రెస్ విభాగాన్ని బలపరచడం, యువ వృత్తిపరుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, సామాజిక , రాజకీయ అవగాహన కార్యక్రమాలను విస్తరించడం, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ విస్తరణకు తీసుకోవలసిన చర్యలపై విస్తృతంగా చర్చ జరిగింది.

శ్రీమతి మీనాక్షి నటరాజన్ విలువైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ప్రజలతో నేరుగా మేళవించే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి జిల్లా స్థాయిలో చురుకైన నాయకత్వాన్ని అభివృద్ధి చేయాలని ఆమె సూచించారు.

# వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలి...






## ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**ఖమ్మం బ్యూరో, నవంబర్ -4, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు రాబోయే 10వ తరగతి, ఇంటర్ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా పని చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల పనితీరుపై ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత శాఖల అధికారులు, కెజిబివి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్స్, కాంప్లెక్ హెడ్ మాస్టర్లు, ఎం.ఈ.ఓ లతో సమీక్షించారు. ఎఫ్.ఆర్.ఎస్, అపార్, ఆధార్ కార్డు, పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత, తదితర అంశాలపై ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు చాలా కీలకమని, జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల నుంచి 10వ తరగతి, ఇంటర్ చదివే పిల్లలు రాబోయే పబ్లిక్ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వారానికి రెండుసార్లు ఫోన్ చేసి పిల్లల చదువుపై ఫాలో అప్ చేయాలని అన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారు పరిశీలించి, అందులో వారికి అవసరమైన మేర అదనపు శిక్షణ అందించాలని, ముఖ్యమైన పాఠ్యాంశాలను అనేకసార్లు బోధిస్తూ పాస్ అయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని, ప్రతి క్యాటగిరి లోని విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ హెడ్ మాస్టర్ లకు సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ లో వంద శాతం నమోదయి, హాజరు వేయాలని, విద్యార్థుల హాజరు శాతంపై శ్రద్ధ పెట్టాలని, గైర్హాజరవుతున్న విద్యార్థులను ఫాలో అప్ చేసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ నెంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు గల సమస్యలు గుర్తించి, త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకోవాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ తెలిపారు. యుడైస్ పోర్టల్ లో నమోదైన ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేయాలన్నారు. మండల విద్యాధికారులు సమర్థవంతంగా పర్యవేక్షణ చేయాలన్నారు. మండలవారిగా, విద్యాసంస్థల వారిగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం సమీక్ష చేసి, హాజరు శాతం 90 శాతానికి ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ప్రిన్సిపాళ్లు ఎవరి విధులు వారు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెడ్ మాస్టర్ల హ్యాండ్ బుక్ ను ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు, కేజీబివి ప్రత్యేక అధికారులు, కళాశాల ప్రిన్సిపల్స్, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతులతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## డిఎం అండ్ హెచ్ ఓ డి.రామారావు





**ఖమ్మం బ్యూరో,నవంబర్ 4 , తెలంగాణ ముచ్చట్లు;** ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వం కల్పించిన అన్ని అనుమతులతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డి ఎం అండ్ హెచ్ ఓ డి .రామారావు అన్నారు. మంగళవారం డిఎంహెచ్ ఓ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడలో శ్రీ సాయి బాలాజీ నర్సింగ్ హోమ్ ను. ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ ను హాస్పటల్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతులతో కూడినఅవసరమైన అన్ని సర్టిఫికెట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజలకు మరుగైన వైద్య సేవలు అందించాలని , సీజనల్ వ్యాధుల ప్రభలుతున్న తరుణంలో జాగ్రత్తలు పాటించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట డాక్టర్ మహేష్, ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల సూపర్వైజర్ కే. పెద్ద పుల్లయ్య, పలువురు సిబ్బంది ఉన్నారు.

# వీరనారాయణపురం తెలంగాణ ఉద్యమ కార్యకర్త చదిరం ఎల్లమ్మ మృతి

**ఎల్కతుర్తి, డిసెంబర్ 02(తెలంగాణ ముచ్చట్లు)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కార్యకర్త చదిరం ఎల్లమ్మ మంగళవారం మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో ఆమె కీలక పాత్ర పోషించిన విషయం తెల్సిందే.



రైల్‌రోకో, సకల జనుల సమ్మె వంటి అగ్రరాస్తా కార్యక్రమాల్లో ముందుండి పాల్గొన్న ఎల్లమ్మ, అప్పటి ఆర్థికశాఖ మంత్రి మరియు ప్రస్తుతం బిజెపి ఎంపీ అయిన ఈటెల రాజేందర్ గారితో కలిసి జైలు జీవితం కూడా గడిపిన నాయకురాలు.

ఉద్యమకాలంలో ఆమె ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా ఎన్నో కష్టాలు, నష్టాలు ఎదుర్కొన్నారు. తెలంగాణ కోసం అంకితభావంతో పనిచేసిన ఇలాంటి ఉద్యమకారులకు అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం, అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం బాధాకరమని కుటుంబ సభ్యులు, ఉద్యమకారులు పేర్కొన్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే అనేక మంది ఉద్యమకారులు మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోగ్యరిత్యా, మానసిక ఒత్తిడితో బాధపడుతూ చివరకు సదిరం ఎల్లమ్మ మరణించడం దురదృష్టకరమని పేర్కొంటూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన చిత్తశుద్ధి కలిగి ఉంటే ఎల్లమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు.

ఎల్లమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ సంతాప కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్, జూపాక శ్రీనివాస్, మరి శ్రీనివాస్, పుట్ట ప్రతాప్, చదిరం రాధమ్మ, మర్రి అమరేందర్, మేకల రాజయ్య, పళ్ళ సమ్మక్క, ముదురుకుల శాంతమ్మ, భాగ్యమ్మ, వజ్రమ్మ, కమలబ్బాయి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# గద్వాల ఎస్సీ హాస్టల్లో దారుణం

**కలుషితాహారం తిని విద్యార్థులకు అస్వస్థత**

**జోగులాంబ గద్వాల,డిసెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో కలుషిత ఆహారం తిని 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడిరచారు. మంగళవారం ఉదయం అల్పాహారం తిన్న విద్యార్థులు యథావిధిగా పాఠశాలకు వెళ్లారు. అరగంట అనంతరం విద్యార్థులకు వాంతులు కావడంతో.. వారిని ఆస్పత్రికి తరలించారు. ఉదయం పెట్టిన ఉప్మాలో పురుగులు వచ్చాయని, ఆ విషయాన్ని వార్డెన్‌కు చెప్పడంతో పారవేశారని విద్యార్థులు తెలిపారు. ఆ తర్వాత అరటిపళ్లు, బిస్కెట్లు తిని స్కూల్‌కి వెళ్లారు. కొద్దిసేపటికే కడుపునొప్పి, వాంతులైనట్లు విద్యార్థులు చెబుతున్నారు.





# సెలబ్రిటీలు మరణిస్తే ఇంత దిగజారుడా

**ఇదేం జర్నలిజం అంటూ వాపోయిన జాన్వీ**

సెలబ్రిటీలు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తోన్న తీరుపై నటి జాన్వీకపూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లి శ్రీదేవి మరణించినప్పుడు అందరూ తనను టార్గెట్ చేశారని బాధ పడ్డారు. కొందరు తన మాటలను మీమ్స్‌గా కూడా ఉపయోగించుకున్నారని అవి చూసినప్పుడు కలిగిన బాధ మాటల్లో వర్ణించలేనని అన్నారు. తాజాగా లెజెండరీ నటుడు ధర్మేంద్ర మృతి చెందినప్పుడు కూడా మీడియా అత్యుత్సాహం చూపించిందని అది నిజమైన జర్నలిజం కాదని జాన్వీ అసహనం వ్యక్తంచేశారు.తన తల్లి మరణించినప్పుడు టీవీ చూడడానికి కూడా భయం వేసిందని జాన్వీ అన్నారు. అమ్మ మరణంపై ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురుగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనేనని భయపడ్డా. ఆ తర్వాత అన్నీ అర్థం చేసుకొని నా పనిపై దృష్టిపెట్టాను అని జాన్వీ చెప్పారు. తాను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా తొలి చిత్రం ప్రచారంలో నేను మా అమ్మను గుర్తుచేసుకుంటూ చెప్పిన మాటలపై కొందరు మీమ్స్ చేశారు. నన్ను టార్గెట్ చేసి మాట్లాడేవారు. అవి చూసి కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉన్నాను. ఆ కాలాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో నేను ఏది చెప్పినా అది అందరికీ తప్పుగానే అనిపించేది. తల్లి మరణంపై కుమార్తె బాధ పడితే దాన్ని కూడా అపహాస్యం చేస్తారని ఎవరైనా ఊహించగలరా. ధర్మేంద్ర విషయంలో కొందరు మరింత దిగజారి ప్రవర్తించారు. సెలబ్రిటీల విషయంలో ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు.. వ్యూస్, లైక్స్ కోసం ఇష్టం వచ్చింది రాస్తున్నారు. ఇలాంటి ధోరణిని ప్రోత్సహించకూడదని జాన్వీ అన్నారు.



# యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే తిరస్కరించే దాన్ని: రసిక దుగల్

బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896